

పత్తి కొనుగోళ్లు పునః ప్రారంభం

మద్నూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండల కేంద్రంలోని జిన్నింగ్‌మిల్లు యజమానులు సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లను నిలిపి వేశారు. దీంతో రైతులు రెండు రోజులు ఇబ్బందులు పడ్డారు. తిరిగి ప్రభుత్వంతో చర్చలు కావడంతో పత్తి కొనుగోళ్లను ప్రారంభించినట్లు కాటన్ కార్పొరేషన్ నాయ కులు వెల్లడించారు. గతంలో మాదిరిగా కాకుండా యల్ 1, ఎల్ 2, ఎల్ 3 పేరిట వర్గీకరించి పత్తి కొనుగోళ్లకు మిల్లులను కేటాయిస్తోంది. బుధవారం నుంచి యధావిధిగా పత్తి కొనుగోలు ఉంటాయని మార్కెట్ అధికారులు తెలిపారు.



వేగంగా.. ధాన్యం కొనుగోళ్లు

- ప్రతి రోజూ 15వేల టన్నులకుపైగా కొనుగోళ్లు చేస్తున్న అధికారులు
- జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 429 కేంద్రాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు
- గతం కంటే 20వేల మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోళ్లు
- రూ.258 కోట్ల చెల్లింపులు
- సన్నాలకు బోనస్ కింద రూ.26.66 కోట్ల చెల్లింపు
- తగ్గిన వరి దిగుబడులు

కామారెడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలకు దండిగా ధాన్యం తరలివస్తోంది. జిల్లాలోని కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే 22వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారంటే రైతులు వరి రాసులను కేంద్రాలకు ఎంతమేర తరలిస్తున్నారో తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 429 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే గత ఏడాది ఇదే సమయంలో పోలిస్తే ఈసారి 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా కొనుగోలు చేశారు. అదేవిధంగా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లింపులు సైతం వెనువెంటే చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.258.65 కోట్ల ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ చేశారు..

429 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిల్లాలో వానాకాలం సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 429 కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఈ కేంద్రాలకు రైతులు పెద్ద మొత్తంలో ధాన్యాన్ని తరలిస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మహిళా సంఘాలు, ప్రాథమిక సహకార సంఘలు, మార్కెటింగ్ శాఖల ఆద్వర్యంలో కొనుగొలు కేంద్రాలను గ్రామగ్రామాన ఏర్పాటు చేశారు. ధాన్యం సేకరణ కోసం జిల్లాకు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వచ్చిన ధాన్యాన్ని వెనువెంటేనే కొనుగోలు చేసేందుకు స్థానికంగా అవసరమైన సామగ్రి అయిన ప్యాడీ క్లీనర్‌లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ క్వాంటాలు, గన్నీ సంచులను అందుబాటులో ఉంచారు.

ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ఇప్పుడిప్పుడే వరి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిపోయి పంట పచ్చిగా ఉన్నప్పటికీ (మిగతా 8లో..)





రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ మంజూరు

జె. చంద్రశేఖర్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, కామారెడ్డి

ప్ర: జిల్లాకు ఏదైన కొత్త ప్రాజెక్టు మంజూరయ్యిందా?

జ: గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతి యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇటీవల యాదాద్రి జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లాకు ఈ ప్రాజెక్టు మంజూరైంది.

ప్ర: ఈ ఇనిస్టిట్యూట్ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు?

జ: ఇటీవలే ఇనిస్టిట్యుట్ మంజూరైనందున అన్ని ఫ్యాకల్టీ కల్పించే విధంగా స్థల సేకరణ భవన నిర్మాణానికి కలెక్టర్‌కు నివేదించాం. ఎక్కడ ఏర్పాటు చేయాలనేది కలెక్టర్ నిర్ణయిస్తారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలో స్థలాన్ని సేకరించేందుకు అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ప్ర: ఈ ఇనిస్టిట్యూట్ ఏ అకాడమీ నుంచి ప్రారంభించనున్నారు?

జ: కేంద్ర ప్రభుత్వం సహకారంతో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ నిర్వహణ కొనసాగనుంది. చేతి వృత్తులకు సంబంధించి వివిధ శిక్షణ తరగతులను ఇవ్వడం జరుగుతుంది.

ప్ర: ఎన్ని కోర్సులతో ఏర్పాటు చేస్తారు?

జ: రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఇనిస్టిట్యూట్ 150 కోర్సులతో ఏర్పాటు చేస్తారు. ఆయా జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లోని యువతి, యువకులు ఆసక్తి చూపే కోర్సులకు ఆధారంగా అందుబాటులోకి తీసుకువస్తారు. కోర్సు ఆధారంగా 15 రోజుల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

ప్ర: ఎంత మంది యువతి యువకులకు శిక్షణ ఇవ్వనున్నారు?

జ: ప్రతీ అకాడమీకి 60 మంది యువతి, యువకులకు శిక్షణ ఇస్తాం. విద్యార్థులకు శిక్షణ సమయంలో స్టైఫండ్ ఉచిత భోజన వసతి కల్పిస్తారు.

• కామారెడ్డి, ఆంధ్రజ్యోతి



ఓవర్‌లోడ్‌తో.. కస్సు బస్సు!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు
- పలు రూట్లలో బస్సు ట్రిప్పుల కుదింపు
- ఒక్కో బస్సులో పరిమితికి మించి రెండింతలు ప్రయాణిస్తున్న ప్రయాణికులు
- సీట్ల కోసం ప్రయాణికుల కొట్లాటలు
- పట్టించుకోని అధికారులు

భిక్కనూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణమో లేక సరిపడా బస్సులు లేకనో ఆర్టీసీ బస్సులు ఏ రూట్లలో చూసినా ప్రస్తుతం కిక్కిరిసిపోతున్నాయి. పరిమితికి మించి ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తుండటంతో ఓవర్ లోడై వాటిలో సమస్యలు తలెత్తి మొరాయిస్తున్న పరిస్థితి నెలకొంటుంది. బస్సు సామర్థ్యం కంటే ఎక్కువగా ప్రయాణికులు ఎక్కడంతో బస్సును కంట్రోల్ చేయలేక డ్రైవర్లు, బస్సులో ఎక్కువ మొత్తంలో ఎక్కిన ప్రయాణికులకు టికెట్లు ఇచ్చేందుకు కండక్టర్లు, బస్సుల్లో సీట్లు దొరకకా ప్రయాణికులు సైతం నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులు ఒక్కో బస్సులో 60 నుంచి దాదాపు 100 మంది వరకు ఎక్కుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎక్కువగా ప్రయాణికులు ప్రయాణించే రూట్లలో మరిన్ని బస్సులను వేయాల్సింది పోయి ఉన్న బస్సుల ట్రిప్పులను తగ్గిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఓవర్‌లోడ్ కారణంగా పలు చోట్ల బస్సులు ఇటీవల ప్రమాదాలకు గురవడం, బస్సుల్లో పొగలు రావడం, బ్రేకులు కంట్రోల్ కాకపోవడం, తదితర సమస్యలు నిత్యం కనిపిస్తున్నా యి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పటి నుంచి తరచూ ప్రయాణికుల మధ్య సీట్ల గురించి, పలు అంశాలపై కొట్లాటలు ఎక్కువగా జరుతున్న సంఘటనలు చూస్తున్నాం.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు

బస్సుల్లో ఓవర్ లోడ్ కారణంగా ఆర్టీసీ సిబ్బందితో పాటుగా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులో ఓవర్ లోడ్ కారణంగా మెట్ల వరకు ప్రయాణికులు నిలబడి ఉండటం కారణంగా వెనకాల వస్తున్న వాహనాలు చూడటానికి ఇబ్బంది ఉండటం, పరిమితికి మించి ప్రయాణికుల కారణంగా బస్సులో పలు సమస్యల కారణంగా డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా దాదాపు ఒక్కో బస్సులో 60 నుంచి 100 వరకు ప్రయాణికులు ఉండటంతో వారికి టికెట్లు ఇవ్వడం అది కండక్టర్లకు పెద్ద టాస్కే. ఒక స్టేజీ నుంచి నిలబడ్డ ప్రయాణిలను జరుపుతూ వారికి టికెట్లు ఇచ్చేలోపే మరో స్టేజీ రావడంతో కండక్టర్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీట్లు దొరకకా, ఎక్కువ సంఖ్యలో బస్సులో ప్రయాణికులు ఉండటంతో స్టేజీ వచ్చిన సమయంలో తొందరగా దిగరాకపోవడం, తదితర కారణాలతో ప్రయాణికుల మధ్య కొట్లాటలు (మిగతా 8లో..)

ఇసుకను పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకోవాలి

• ప్రభుత్వ సలహాదారు పోచారం



బీర్కూర్‌లో మాట్లాడుతున్న పోచారం

బీర్కూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరిట ఇసుకను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం బీర్కూర్ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇస్తున్న ఇసుకను పక్కదారి పట్టించి అక్రమంగా బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అట్టి ట్రాకర్లను సీజ్ చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మొరం అవసరం ఉంటుందన్నారు. అయితే అధికారులు లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా ఇసుక, మొరం అందించాలన్నారు. ఇసుక లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల స్థలికి చేరుతుందా లేదా అధికారులు తెలుసుకోవాలన్నారు. లబ్ధిదారులకు తక్కువ చార్జీలతో ఇసుక ట్రాన్స్‌పోర్టు చేయాలన్నారు. ఎక్కువ చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బీర్కూర్ మాజీ సర్పంచ్ సానెపు గంగారాంను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు అంజిరెడ్డి, శశికాంత్, రఘు, అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చంపుతున్న చలి

- జిల్లాలో అమాంతంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- 9.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదు
- బొమ్మదేవునిపల్లిలో 8.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు

కామారెడి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాను చలి వణికిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా చలిగాలులతో పాటు ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. తీవ్రమైన చలి గాలులతో ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారు. ఉదయం,మధ్యాహ్నం, రాత్రి అనే తేడా లేకుండా రోజంతా శీతలగాలులు వీస్తున్నాయి. మరో వారం రోజులుగా చలిగాలులు పెరిగి ఉష్ణోగ్రతలు మరింత పడిపోతాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా జ్వర పీడితులు పెరిగారు. ప్రతీ ఇంట్లో జలుబు, జ్వరం, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారు ఎక్కువవుతున్నారు. జిల్లాలో మంగళవారం 9.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా నసురుల్లాబాద్ మండలం బొమ్మనిదేవునిపల్లిలో 8.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు ఎక్కువ శాతం బయటకు రాకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

అమాంతంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

జిల్లా పరిధిలో గత 10 రోజుల వ్యవధిలోనే ఉష్ణోగ్రతలు అమాంతంగా పడిపోయాయి. పది రోజుల కిందట కనిష్ఠ ఉష్ణోగ్రత 19.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా మంగళవారం 9.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు పడిపోయింది. దీంతో చలి తీవ్రత అధికమైంది. తెల్లవారు జామున పనులు చేసుకునేవారు చలిని తట్టుకోలేక పోతున్నారు. చల్లటి వాతావరణం ఉండడంతో తమ పనులు చేసుకోవడానికి వారి అవస్థలు పడుతున్నారు. అలాగే కూలినాలి చేసుకునే కార్మికులు జీవనోపాధి కోసం రాత్రిళ్ల వాచ్‌మెన్ విధులు నిర్వహించే వారు మంట వేసుకుంటున్నారు. ప్రస్తుతం ఉత్తర దిశ నుంచి వీస్తున్న చలి గాలులతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చలితో రక్తం మందంగా మారే అవకాశం ఉన్నందున బీపీ, షుగర్, గుండె సంబంధ వ్యాధులున్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. కాగా చలిగాలులతో ప్రతీ ఇంట్లో ఎవరో ఒకరు జ్వరం, జలుబు, దగ్గు, వంటి సమస్యలతో బాధపడుతున్నారు.



చలి తీవ్రతకు మంట కాచుకుంటున్న దృశ్యం



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి : ఎస్పీ

కామారెడ్డి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. మంగళవారం కామారెడ్డి సర్కిల్ పరిధిలోని దేవునిపల్లి పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్ రికార్డు, స్టేషన్ రైటర్, టెక్‌టీమ్, లాకప్ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ప్రాపర్‌గా బ్లూకోట్, పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించాలని, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, సీఐ రామన్, ఎస్‌హెచ్‌వో రంజిత్, ఎస్సై భువనేశ్వర్, ఏఎస్సై గంగాసాగర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మార్కెట్ కమిటీకి మంత్రులు తుమ్మల, సీతక్క రాక

భిక్కనూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో కాంప్లెక్స్ భవన నిర్మాణాల భూమిపూజ కార్యక్రమానికి గురువారం తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి సీతక్క, ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ వస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ పాత రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం తెలిపారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రాజు



మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతిలో నిర్వహించిన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశాభివృద్ధికి పునాది అని ప్రతీ విద్యార్థి మత్తు పానీయాలు, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల ప్రభావం వ్యక్తిగత జీవితంపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతాయని కుటుంబం, సమాజాన్ని కూడా దెబ్బతిస్తుందని తెలిపారు. ప్రతీ విద్యార్థి డ్రగ్ రహిత సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌సీసీ నాగరాణి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీడబ్ల్యూవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకురావాలి

రైతులు సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకురావాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ తెలిపారు. సీసీఐ సీఎండీ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో వారి హామీలను త్వరలోనే నెరవేరుస్తామని హామీ ఇవ్వడంతో నిరవధిక బందును విరమించుకున్నారని తెలిపారు. రైతుల్లో కొందరు పత్తి దిగుబడి ఎక్కువగా రావడం వల్ల క్రాప్ బుకింగ్‌లో సమస్యలు వస్తాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సంబంధిత గ్రామంలోని ఏఈవోలను సంప్రదించాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఏఈవోలు దిగుబడిని క్రాప్‌బుకింగ్‌లో నమోదు చేసి ధ్రువీకరిస్తారని తెలిపారు. ధ్రువీకరణ పూర్తయిన తర్వాత రైతులు నేరుగా సీసీఐ కేంద్రాలకు పత్తి అమ్ముకోవచ్చని తెలిపారు. ప్రతీ రైతు తమ అసలు దిగుబడి వివరాలను ఏఈవో (మిగతా 8లో..)

లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో నారసింహ హోమం

మాచారెడ్డి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం సుదర్శన నారసింహ హోమం నిర్వహించినట్టు ఆలయ పూజారులు తెలిపారు. ఈ మేరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో ప్రభు రాంచంద్రం, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక సింధూర పూజలు నిర్వహించారు. శ్రావణమాస చివరి మంగళవారం సందర్భంగా ప్రత్యేక, సింధూర పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛారణలతో భైరవుని పూజలు, ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ఈవో బుర్ల ప్రభు గుప్తా నేపథ్యంలో ఆలయ వంతులు శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, రంగారెడ్డి, మెదక్ తదితర భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ల ప్రభు గుప్తా, మాజీ చైర్మెన్ దోమకొండ శ్రీనివాస్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నాగరా జు, అధికారులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పాల్వంచ విద్యార్థులు



పాల్వంచ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీలకు పాల్వంచ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం గోవర్ధన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో రాంమనోహర్ రావు, హెచ్ఎం మాట్లాడుతూ పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు దుర్గాలక్ష్మీవైష్ణవి, ప్రణీత, పవిత్ర, ఆస్మిత జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ అతీతుల్లా, పాఠశాల చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక తెచ్చి చూడు.. ఇల్లు కట్టి చూడు

- ట్రాన్స్‌పోర్ట్ చార్జీల పేరిట ఇసుక ధర పెంపు
- ట్రాక్టర్ యజమానుల సిండికేట్
- లబ్ధిదారుల జేబుకు చిల్లు
- పట్టించుకోని అధికారులు 7

క్రైం సమాచారం

బస్సును ఢీకొన్న ఆటో.. డ్రైవర్‌కు గాయాలు


ఇరుక్కున్న ఆటో డ్రైవర్

నవీపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో మంగళవారం బస్సును వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నుంచి భైంసాకు వెళ్తున్న ఆర్డీనరీ బస్సు యంచ బస్టాండ్ దాటిన తరువాత కొద్ది దూరంలో వెనుక నుంచి వాల్ పెయింట్ డబ్బాల లోడ్‌తో ఉన్న ట్రాలీ అదుపు తప్పి బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తన స్టీరింగ్ వద్దనే ఇరుక్కుపోయాడు. అదేసమయంలో బస్సు వెనుక వైపు అద్దాలు పగిలిపోగా ట్రాలీ ఆటోలో ఉన్న వాల్ పెయింట్ డబ్బాలు కింద పడటంతో చాలా బాగం పెయింట్ నేలపాలైంది. ఆటోలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను జేసీబీ సహాయంతో బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ ఆటో డ్రైవర్‌ను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై బస్సు డ్రైవర్ నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు వెల్లడించారు.

దాడి కేసులో యువకుడి రిమాండ్

నిజామాబాద్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో దాడులకు పాల్పడిన గౌతంనగర్‌కు చెందిన యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈనెల 17న సాయంత్రం 6.40 గంటల సమయంలో నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద గౌతంనగర్‌కు చెందిన గోవింద్ (28) బైక్‌పై వచ్చి సిగ్నల్ వద్ద ఆగివున్న కారును వెనుక నుంచి వచ్చి ఢీకొట్టాడు. మద్యంమత్తులో ఉన్న గోవింద్ కారులో ప్రయాణిస్తున్న నలుగురిని దుర్భాషలాడటమే కాకుండా వారిపై భౌతికదాడులకు పాల్పడి గాయపరిచాడు. దాంతో బాధితులు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. సీఐ శ్రీనివాస్ కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి నిందితుడికి 14రోజుల రిమాండ్ విధించారు.

ద్విచక్రవాహనం చోరీ

సుభాష్‌నగర్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని మనోరమ ఆసుపత్రి వద్ద ఉన్న యాక్టివా బైక్‌ను ట్రాలీ ఆటోలో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. హబీబ్‌నగర్‌కు చెందిన అమన్ మంగళవారం తన తండ్రిని ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లగా తన బైక్‌ను ఆసుపత్రి ఎదుట పార్క్ చేశాడు. బయటకి వచ్చి చూస్తే బండి లేకపోవడంతో ఆసుపత్రిలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి వాహనాన్ని ట్రాలీ ఆటోలో తీసుకెళ్లినట్లు కనిపించింది. వాహనాన్ని ఫైనాన్స్ ఏజెంట్లేనని తీసుకెళ్లారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదు రోజుల జైలు శిక్ష

సుభాష్‌నగర్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన నగరానికి చెందిన సంతోష్‌కు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ 5రోజుల జైలు శిక్ష విధించినట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈ నెల 15న వాహనాలు తనిఖీ చేస్తుండగా సంతోష్ మద్యం తాగి వాహనం పట్టుబడ్డాడన్నారు. మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా జైలు శిక్ష విధించారన్నారని పేర్కొన్నారు.

మృతదేహానికి రీ పోస్టుమార్టం

రుద్రూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భర్త మృతిపై అనుమానంతో మృతదేహాన్ని వెలికి తీయించిన సంఘటన రుద్రూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న కథనం ప్రకారం.. మండలంలోని ఆర్‌ఎస్సీ కాలనీకి చెందిన మేతరి సాయిలు(ట్రాక్టర్ డ్రైవర్) అనారోగ్యంతో బాధపడుతూ పది రోజుల కిందట మృతిచెందాడు. సాయిలు మొదటి భార్య శోభ మరణించగా, కోటగిరికి బొర్ర సాయవ్వతో రెండో వివాహమైంది. వీరికి ఓ కూతురు ఉంది. సాయిలు అనారోగ్యంతో మృతి చెందినా.. అంత్యక్రియలు చేసిన సమాచారం తనకు ఇవ్వలేదని భార్య సాయవ్వ ఆరోపించింది. తన భర్త మృతిపై గైని పెద్ద సాయిలు, గైని శివలీల, గైని పోచమ్మలపై అనుమానం ఉందని సాయవ్వ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ రీ పోస్టుమార్టం నిర్వహించాలని కోరింది. ఈ మేరకు కేసు నమోదుచేసి మంగళవారం సాయిలు మృతదేహాన్ని వెలికి తీశారు.

ఒకరి అదృశ్యం

బోధన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలం హున్సా గ్రామానికి చెందిన వడ్ల నరేందర్(45) ఐదేళ్ల కిందట అదృశ్యమయ్యాడని బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. కుటుంబీకులు ఎంత వెతికినా జాడ కనిపించలేకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

రెండు వాహనాలపై కేసు

బోధన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంజీరా సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా రెండు ఆటోలపై, రెండు టాటా ఏసీ ఆటో వాహనాలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

కూరగాయాలు



కూరగాయల ధరలు మార్కెట్‌లో మంటపుట్టిస్తున్నాయి. సామన్యుడి వాటిని కొనడానికి అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. చేతిలో రూ.500 పట్టుకొని మార్కెట్‌కు వెళ్తే.. మునుపటిలా వారానికి సరిపడా కొనుక్కొచ్చే పరిస్థితి లేదు. కార్తీక మాసం, అయ్యప్ప దీక్షలు, వివాహాది శుభకార్యాలు ఉండటంతో కూరగాయాల వినియోగం విపరీతంగా పెరిగింది. పంటల సాగు తగ్గడం, మొంథా తుపాను ప్రభావంతో దిగుబడి పడిపోవడంతో ధరలు పెరిగాయి. - బోధన్

▸▸ మార్కెట్‌లో పెరిగిన ధరలు ▸▸ జిల్లాలో తగ్గిన సాగు ▸▸ మొంథా తుపాను ప్రభావంతో పంట నష్టం

బోధన్ డివిజన్ పరిధిలోని హున్సా, మందర్న, ఖాజాపూర్, మినార్‌పల్లి, కొప్పర్గ, మహారాష్ట్రలోని బిలోలి, సగ్రోల్లి, ప్రాంతాలలో కూరగాయాలను సాగుచేస్తారు. మార్కెటింగ్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రైతులు క్రమంగా సాగు తగ్గించారు. అక్కడక్కడా సాగు చేసిన పంటలు మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయల పెరిగిపోయాయి. దీనికి తోడు మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటుండటంతో వ్యాపారులు ఖర్చులను కలిపి వినియోగదారులపై వడ్డిస్తున్నారు. ధరలు రెట్టింపు కావడంతో ఓ వైపు వినియోగదారులు ఇబ్బందులు పడుతుంటే.. విక్రయించడానికి వెళ్తున్నా ఎవరూ కొనడానికి ముందుకు రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

మహారాష్ట్ర నుంచి తెస్తున్నాం..

మొంథా తుపాన్ ప్రభావంతో కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. మహారాష్ట్రలోని బిలోలి, సగ్రోల్లి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వర్షాలు పడి పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయి. మరో పక్క రవాణా ఛార్జీలు అదనంగా పడటంతో కూరగా యల ధరలు భారీగా అయ్యాయి. - **ఎండీ జునేద్, వ్యాపారి**

ధరల పెంపుతో ఆర్థిక భారం



ఇటీవల కూరగాయాల ధరలు విపరీతంగా పెరిగాయి. వీటితో పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది. మేము రోజూ 2-3 కిలోల కూరగాయాలను కొనుగోలు చేస్తాం. ఒకటి రెండు కూరగాయాలకు రెండు నుంచి మూడు వందలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది.
- **నాగమణి, గృహిణి, బోధన్**

కూరగాయల ధరల వివరాలు (రూ.ల్లో)

కూరగాయ	గతంలో	ప్రస్తుతం
టమాట	20	50
వంకాయ	40	80
బెండకాయ	40	80
కాకరకాయ	40	80
దోసకాయ	30	60
బీట్‌రూట్	40	80
క్యారెట్	60	100
క్యాబేజ్	30	60
చిక్కుడుకాయ	60	120
బీరకాయ	40	80
దొండకాయ	40	70
కొత్తిమీర	50	120
పుదీనా	50	120
పచ్చిమిర్చి	40	80


గోవా గవర్నర్‌ను సన్మానిస్తున్న కోటపాటి నరసింహనాయుడు

గోవా గవర్నర్‌ను కలిసిన కోటపాటి

ఆర్మూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన అశోక గజపతి రాజును మంగళవారం దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు మంగళవారం కలిసి సన్మానించారు. పనాజీలో గవర్నర్‌ను కలిశారు. విజయనగర సామ్రాజ్యంలో భాగమైన గోవాకు విజయనగర రాజు అశోక గజపతి రాజు గవర్నర్‌గా రావడం ఆనందదాయకమని కోటపాటి గుర్తుచేశారు. అనంతరం గవర్నర్ అశోక్ గజపతిరాజు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా రైతు నాయకులు వెంకటేశ్వర్‌రావు, బాలకృష్ణ పాల్గొన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎంపీడీవో శ్రీనివాస్

సాలూర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలని సాలూర ఎంపీడీవో శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని తగ్గెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీడీవో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రికార్డులు, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. వంటశాలలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ధన్‌రాజ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాణంపల్లి అభివృద్ధికి కృషి చేస్తా

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

రుద్రూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాణంపల్లి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పోచారం పేర్కొన్నారు. మండలంలోని రాణంపల్లిలో రూ.50 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణానికి, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంగళవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో 11 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి, పంపిణీ చేశామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ హయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా అభివృద్ధి చేకూరుస్తుందని వివరించారు. అదేవిధంగా మున్నూరు కాపు సంఘంలో వంట శాల లేదని కోరగా, వంటశాల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాల గంగాధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, ఉమ్మడి మండలాల ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా, తహసీల్దార్ తారాబాయి, మాజీ జడ్పీటీసీ గంగారాం, దిశా కమిటీ మెంబర్ నగేష్, నాయకులు రాము, సంగయ్య, పత్తి లక్ష్మణ్, బాలరాజు, రాములు, షేక్ ఖాదర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి వద్ద బీఆర్ఎస్ నేతలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

కేటీఆర్‌కు ఘన స్వాగతం

కమ్మర్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో పత్తి రైతులను కలవడానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్)ను కమ్మర్‌పల్లి వద్ద బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నియోజికవర్గ బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చౌట్‌పల్లి చౌరస్తా వద్దకు చేరుకొని స్వాగతం పలికిన ప్రశాంత్‌రెడ్డి కేటీఆర్‌కు రైతు ఆకుపచ్చ కండువా కప్పారు. అనంతరం కేటీఆర్‌తో కలిసి ఆదిలాబాద్‌కు పయనమయ్యారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు బద్దం చిన్నారెడ్డి, సుధాకర్, గంగారెడ్డి, నరేందర్ కేకే, నరేందర్, రాజు, మురళి, మహేందర్, రఘు తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి విజేతగా బాల్కొండ జట్టు


బాల్కొండ: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముప్కాల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్ -17 ఖోఖో పోటీల్లో బాల్కొండ కేజీబీవీ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రత్యేక అధికారిణి భవాని తెలిపారు. ప్రతిభ కనబర్చిన మైత్రి, శ్రీ వర్ష, నవశ్రీ, గంగోత్రిలను ఉమ్మడి జిల్లా ఖోఖో జటుట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ రాధికను ఆమె అభినందించారు.

జోనల్‌స్థాయికి ఎంపిక..

భీమ్‌గల్: పట్టణంలో నిర్వహించిన బాలబాలిక ఖోఖో పోటీల్లో అండర్ 14, 17 విభాగంలో విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ రమణ తెలిపారు. భీమ్‌గల్ అర్బన్ జోన్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కృషి స్కూల్ కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, భీమ్‌గల్ అర్బన్ జోన్ ఇన్‌చార్జి సెక్రటరీ, సదమస్తుల రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు అభిషేక్ రాజాశేఖర్, లింగం, గంగాధర్, ప్రశాంత్, సునీల్, విశాల్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల అండర్ 17 జోనల్ స్థాయి విభాగంలో బాలబాలికల ఖోఖో జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. పీడీ వేముల నాగభూషణం, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమాకుమారి పోటీలను ప్రారంభించారు.కార్యక్రమంలో పీఈటీలు శ్యామ్, నగేష్, మాధురి, లత, బాలు, ప్రీతి, లలిత, సంజీవ్ తదితరులున్నారు.


రథంపై ఉత్సవ మూర్తులు


హారతులతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కనులపండువగా సప్తహారతి


పాల్గొన్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

పెర్కిట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నవనాథ సిద్దేశ్వర స్వామి దేవాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం సప్తహారతి, గిరిప్రదక్షిణ కనులపండువగా కొనసాగింది. బహుళ మాస శివరాత్రి పురస్కరించుకొని సిద్దేశ్వర, సీతారామ లక్ష్మణ, అంజనేయ అయ్యప్ప ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగిస్తూ సప్తహారతిని స్వామివారికి సమర్పించారు. వేడుకల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, మంగి రాములు మహరాజ్, నందీశ్వర మహరాజ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

పెర్కిట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి నలంద పాఠశాల విద్యార్థులు వ్యవసాయ మార్కెట్ యార్డును మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అక్కడ జరిగే క్రయ విక్రయాలు, విధులపై మార్కెట్ కమిటీ సెక్రటరీ పరమేశ్వర్ రావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు మార్కెట్ కమిటీ ఉపయోగాలను వివరించారు. అనంతరం నలంద పాఠశాల ఉపాధ్యాయులు, సెక్రటరీ పరమేశ్వర్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి సుమన్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు పవిత్ర, కవిత, శాలిని పాల్గొన్నారు.

నూర్పిడి కల్లాలకు భూమిపూజ

మోర్తాడ్ , నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతులు పంటలు ఆరబెట్టుకునేందుకు కల్లాల నిర్మాణానికి ఎంపీడీవో తిరుమల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు మంగళవారం భూమిపూజ చేశారు. గ్రామానికి 12 కల్లాలు మంజూరయ్యాయని, ఒక్కో దానికి రూ.70వేలు కేటాయించినట్లు ఎంపీడీవో తెలిపారు. రైతులు పండించిన పంటలు ఆరబెట్టుకునేందుకు, పంట నూర్పిడి చేసేందుకు అవసరం అవుతాయని ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శ కుంతల, పంచాయతీకార్యదర్శి సైపొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.


పంట నూర్పిడి కల్లాలకు భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో తిరుమల

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


ఆలయంలో పూజలు చేస్తున్న గౌడ కులస్థులు

జక్రాన్‌పల్లి , నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిప్యాక్‌లో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలను గౌడ సంఘం సభ్యులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు లింబాద్రి గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు వేంపల్లి శ్రీనివాస్ గౌడ్, రాజాగౌడ్, బోజగౌడ్, సుదర్శన్ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సురేష్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు , గ్రామస్థులు పాల్గొన్నారు.

ధర్మానిదే విజయం

కోటగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మం వైపు నిలబడిన వారిని విజయం వరిస్తుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తోగుట పీఠాధిపతి మధుసూదనందస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శ్రీ సాయి అయ్యప్ప ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆలయంలో 108 కళశాలతో అభిషేకం, రుద్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ విట్టల గుప్తా, నిశాంత్, అశ్విన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ప్రవచిస్తున్న మధుసూదనంద స్వామి


మైనంపల్లి హనుమంతరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

కుంభాభిషేకానికి ఆహ్వానం

నవీపేట,నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 29 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహించే మహా కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. మంగళవారం మండలంలోని జన్నేపల్లి గెస్ట్‌హౌస్‌లో ఆలయ కమిటీ సభ్యులు మైనంపల్లి హనుమంతరావును ఆహ్వాన పత్రికను అందజేశారు. మూడు రోజుల పాటు ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు. స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.


బోధన్‌లో మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్


జక్రాన్‌పల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై


ప్రతిజ్ఞ చేయిస్తున్న రెంజల్ ఎస్సై చంద్రమోహన్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాదకద్రవ్యాల రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పోలీసులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలోని వివిధ మండలాల్లో మంగళవారం ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. మాదకద్రవ్యాలు అలవాటు చేసుకోవద్దని, మత్తుకు బానిస కావద్దన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ప్రభుత్వ సంకల్పంతో ప్రతి ఒక్కరు భాగస్వాములం కావాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. వ్యసనాలకు అలవాటు జీవితం నాశనం అవుతుందన్నారు. - **నెట్‌వర్క్**


ఆర్మూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, పాల్గొన్న మునిసిపల్ అధికారులు


సాలూర విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌బాబు


నగదు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్థిక సహాయం అందజేత


ఏర్గట్ల, 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లక్ష్మీ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా.. మంగళవారం కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ బాధిత కుటుంబానికి రూ.5 వేలు పంపించారు. కాంగ్రెస్ నాయకులు మృతురాలి కుటుంబానికి ఇంటికివెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జీవన్, మునిమాణిక్యం తదితరులున్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

భీమ్‌గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మునిసిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునిసిపల్ కార్మికులు ప్రజల కోసం నిత్యం పనిచేస్తున్నారని కానీ ప్రభుత్వం వీరికి కనీస సౌకర్యాలు కల్పించలేకపోతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేల ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఏటా కార్మికులకు నిత్యవసర వస్తువులు, పనిముట్లు అందజేసి 3నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి తగిన వైద్యం అందించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరిచాలని డిసెంబరు 5 నుంచి 9 వరకు మెదక్‌లో రాష్ట్ర మహాసభలు చేపట్టామన్నారు. సమావేశంలో నాయకులు పోషన్న, గంగంగవ్వ, బాలవ్వరాజన్న, తదితరులున్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నాగిరెడ్డిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషిచేస్తున్నానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మంగళవారం మండలం లోని తాండూర్‌లో 60 కల్యాణలక్ష్మి, 3 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు, కొత్త రేషన్ కార్డులు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకుంటుందని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 4 వేల వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్టు తెలిపారు. తాండూర్‌లో అతిపురాతన త్రిలింగేశ్వర ఆలయ అభివృద్ధి కోసం రూ.75 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. అనంతరం త్రిలింగేశ్వర ఆలయంలో పవిత్ర కార్తీకమాసం సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి, నాగిరెడ్డిపేట తహసీల్దార్, శ్రీనివాస్ రావు, ఎంపీడీవో లలిత కుమారి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, తాండూర్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, శ్రీనివాస్ రెడ్డి, కిష్టయ్య, ఇమామ్, శ్రీరామ్ గౌడ్, సురేందర్ గౌడ్, లక్ష్మణ్ ఠాగూర్, షాహిద్, మురళి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వాటర్ ప్యూరిఫయర్ అందజేత



ఆలయానికి వాటర్ ప్యూరిఫయర్ అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయానికి మండలకేంద్రానికి చెందిన అన్నం హరీశ్ మంగళవారం వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. వ్యవస్థాపక గురుస్వామి శంకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డిలకు అందజేశాడు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సాయిరెడ్డి మాట్లాడుతూ.. దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించడం ఆనందంగా ఉందని, అయ్యప్ప కరుణాకటాక్షాలు ఎల్లవేళలా దాతలపై ఉండాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పాండు రంగశర్మ, అన్నం ముత్తయ్య, సవిత, ర్యాల విఠల్‌రెడ్డి, నక్క లక్ష్మణ్, సిద్ధి మహేశ్, మధు, అరుణ్, రాజు, నర్సన్నచారి, తదితరులు ఉన్నారు.

బీర్కూర్‌లో ఉచిత వైద్యశిబిరం



బీర్కూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బీర్కూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలతో పాటు షుగర్ పరీక్షలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు సతీష్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, జోన్ చైర్మన్ సంతోష్, లయన్స్ కిషోర్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

నసురుల్లాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, షీ టీం మహిళలకు, విద్యార్థినులకు తోడుగా ఉంటుందని షీటీం సభ్యులు అన్నారు. మంగళవారం మండలంలోని నెమలి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు షీటీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యుడు అనిల్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం షీటీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు ప్రియాంక, ఎస్బీ కానిస్టేబుల్ గంగారం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం

మద్నూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేనూర్ మోడల్ పాఠశాలను జుక్కల్ ఎమ్మెల్యే మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్డు లేక ఆరుబయట కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారని, ఆట స్థలం లేదని సిబ్బంది తెలిపారు. అదేవిధంగా మోడల్ పాఠశాలకు సరిపోయే గదులు లేవని, హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి ప్రిన్సిపాల్ నర్సాగౌడ్ తీసుకెళ్లారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మద్నూర్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పరమేష్ పటేల్, మాజీ సర్పంచులు విఠల్ గురూజీ, హనుమంత్ రావ్ దేశాయ్, నాయకులు సబ్ దే చందు, పాఠశాల సిబ్బంది మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తెచ్చి చూడు.. ఇల్లు కట్టి చూడు



- ట్రాన్స్‌పోర్ట్ చార్జీల పేరిట ఇసుక ధర పెంపు
- ట్రాక్టర్ యజమానుల సిండికేట్
- లబ్ధిదారుల జేబుకు చిల్లు
- పట్టించుకోని అధికారులు

బీర్కూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందజేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను భారీగా పెంచడంతో లబ్ధిదారులు బెంబేలెత్తుతున్నారు.

మరోవైపు ఇసుక కొరత...

అసలే ఇసుక కొరత వేధిస్తుండగా ఈ చార్జీలు మరింత భారాన్ని మోపుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మంజీరా నదిలో వరద నీరు భారీగా వచ్చి చేరింది. నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తడంతో మంజీరాలో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఇసుక కొరత తీవ్రంగా ఏర్పడింది.

చార్జీల భారం తగ్గాలంటే..

ఇసుక తరలింపునకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీల ధరలు తగ్గాలంటే అధికారులు మండలంలో మరో రెండు మూడు గ్రామాల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తే మంచిదని ఇందిరమ్మ లబ్ధిదారులు పేర్కొంటు న్నారు. అలా చేస్తే ఇసుకకు డిమాండ్ తగ్గి ధరలు తగ్గుతాయని పలువురు చెబుతున్నారు.

తవ్వకాలకు అనుమతులు

వర్షాలు తగ్గుముఖం పట్టడం తో మంజీరా నదిలో నీటి ప్రవాహం తగ్గింది. మండలంలో బరంగ్ ఏడ్గి, బీర్కూర్, కిస్టాపూర్, చించోలి, దామరంచ గ్రామాలలో ఇసుక పాయింట్‌లు ఉన్నాయి. అయితే ఇందిరమ్మ ఇళ్ల కోసం అధికారులు బీర్కూర్ మండలం చించోల్లి గ్రామ సమీపంలోని మంజీరా నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ఇసుక కొరత తీవ్రంగా ఉండటంతో ఇసుకకు భారీగా డిమాండ్ ఏర్పడింది. మండలంలో 5 చోట్ల ఇసుక తవ్వకాల పాయింట్‌లు ఉండగా అధికారులు ఒకే గ్రామంలో చించొల్లిలో ఇసుక తవ్వకా లకు అనుమతులు ఇచ్చారు. దీంతో ఇసుక కోసం లబ్ధిదారుల నుంచి భారీగా డిమాండ్ ఏర్పడింది. ఇసుక డిమాండ్‌ను ఆసరగా చేసుకుని ట్రాక్టర్ యజమానులు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను భారీగా పెంచేశారు.

ఎమ్మెల్యే ఆదేశాలు సైతం..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఏ గ్రామానికి ఎంత మేర ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు వసూలు చేయాలనే విషయమై ట్రాక్టర్ యజమానులతో ఇదివరకే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చర్చించారు. లబ్ధిదారుల నుంచి తక్కువ మొత్తంలో చార్జీలు వసూలు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ ఆదేశాలను లెక్క చేయకుండా ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను భారీగా పెంచేశారు. గతంలో బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలాలకు రూ.2 వేల నుంచి 2,500 వరకు వసూలు చేసేవారు. ప్రస్తుతం రూ.2,700 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చార్జీలను పెంచినా అధికారులు పట్టించుకోవడం లేదు. మంజీరాలో మొరంతో దారులు వేయ డానికి రూ.4 లక్షలు ఖర్చయ్యిందని, అందుకే చార్జీలు పెంచామని ట్రాక్టర్ యజమానులు చెప్పడం గమనార్హం.

చార్జీలు వసూలు చేస్తే చర్యలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక అందిస్తున్నాం. ట్రాన్స్‌పోర్ట్ చార్జీల పేరిట ట్రాక్టర్ యజమానులు అధిక డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- సాయిభుజంగరావు, తహసీల్దార్



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

తిమ్మాపూర్‌లో రుణమేళా

బీర్కూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం నసురుల్లాబాద్ మండలకేంద్రంలోని డీసీసీబీ బ్యాంకు ఆధ్వర్యంలో రుణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నసురుల్లాబాద్ డీసీసీబీ బ్యాంకు మేనేజర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ.. నసురుల్లాబాద్ డీసీసీబీ బ్యాంకు పరిధిలోని రైతులకు కర్షకమిత్ర రుణాలు, గృహ రుణాలు, విద్యా రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ బ్యాంకు అధికారులను సంప్రదించి రుణాలు పొందాలని ఆయన కోరారు. అదే విధంగా డిజిటల్ లావాదేవీలు, లాకర్ సదుపాయాలు, డిపాజిట్‌లపై అధిక వడ్డీలు అందిస్తున్నామని తెలిపారు. బంగారు ఆభరణాలపై కూడా రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. కార్యక్రమంలో మైలారం విండో అధ్యక్షుడు హన్మంత్ రావు, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ భూమేష్, సీఈఓ నరేందర్, డైరెక్టర్లు రవి, సంగ్యా నాయక్, రైతులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభను పెంపొందించుకోవాలి

పెద్ద కొడప్‌గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు టెక్నాలజీ ద్వారా ప్రతిభను పెంపొందించుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రూ.54 లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతుల గదులు, సైన్స్‌ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని సన్మార్గంలో పయనించేలా చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చిన్నారుల భవితకు బంగారు బాటలు వేస్తుందని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో విద్యావ్యవస్థను మెరుగు పర్చాలని, ప్రతి పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయ సిబ్బంది తరగతి గదులు, ల్యాబ్‌లు ఇతర మౌలిక అంశాల కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ నిరాదరణకు గురైవెనుకబాటు తనానికి గురైందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో అభినవ్ చందర్, ఎంఈవో ప్రవీణ్ కుమార్, ప్రదానోపాధ్యాయురాలు కమల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, చిప్ప మోహన్, మల్లప్ప పటేల్, శ్యామప్ప, హైమద్, అనంత్‌రావ్ దేశాయ్, సంజీవ్, బస్వరాజ్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

ఇళ్ల నిర్మాణపనులు వేగవంతం చేయాలి

నసురుల్లాబాద్, పెద్దకొడప్‌గల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల వ్యాప్తంగా నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణాలు పూర్తిచేసిన వారికి విడతల వారీగా బిల్లులు అందేలా చూడాలని అన్నారు. ఆయన వెంట ఎంపీవో సూర్యకాంత్, పంచాయతీ సెక్రెటరీ రాజేష్, కారోబార్ రతన్, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

● పెద్దకొడప్‌గల్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ పేర్కొన్నారు. మంగళవారం కాస్లాబాద్‌లో ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ మంజూరు పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అభినవ్ చందర్, ఎంపీవో లక్ష్మీకాంత్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి శివాజీ, నాయకులు హైమద్, భూషప్ప తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

మహిళలకు పుస్తకాల పంపిణీ

మద్నూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాయి. ఇందులో భాగంగా మంగళవారం మద్నూర్ ఐకేపీ కార్యాలయంలో నిరక్షరాస్యులైన మహిళా సంఘాల సభ్యులకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ దుర్గా, సంగీత అక్షర వికాసం పుస్తకంలో ఉన్న విషయాలను వివరించారు. అక్షరాస్యత పైన గ్రామ సంఘంలో ఒక కమిటీ ఏర్పాటుచేసుకొని నిరంతరం పర్యవేక్షణ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం జగదీష్ కుమార్, మండల సమైక్య అధ్యక్షురాలు రేణుక, సీసీలు అకౌంటెంట్లు ఆయా గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులు వీవోఏలు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

జుక్కల్ మార్కెట్ బంద్

జుక్కల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల కేంద్రంలో రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ మండల కేంద్ర ప్రజలు స్వచ్ఛందంగా వ్యాపార దుకాణాలను మూసి ఉంచి బంద్ పాటించారు. గ్రామ పెద్దలు జుక్కల్ మండల కేంద్రంలో తిరు గుతూ ప్రతి దుకాణం బందు చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో రహ దారి అధ్వానంగా మారడంతో సదరు కాం ట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తూ కాలం వెలదీ స్తున్నారని అన్నారు. దీంతో రాకపోకలు నిర్వహించే ప్రజలకు ఇబ్బందిగా ఏర్పడిం ది. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని వారన్నారు. జుక్కల్ మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణం, సెంట్ర ల్ లైటింగ్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వారి వారి దుకాణాలు మూసి ఉంచి జుక్కల్ బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జుక్కల్ మండలకేంద్రంలో దుకాణాలను బంద్ చేయిస్తున్న ప్రజలు



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న దృశ్యం

బాధిత కుటుంబాలకు పరామర్శ

ముప్కాల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామంలో బాధిత కుటుంబాలను మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆరేపల్లి మురళి తల్లి ఇటీవల మరణించింది. గ్రామానికి చెందిన ఆరెపల్లి భోజన్న కాలేయ సంబంధిత ఆపరేషన్ అయింది. ఆరేపల్లి నర్సుబాయి క్యాన్సర్‌తో మరణించింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ముప్కాల్ మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యపై విద్యార్థులకు అవగాహన

కోటగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందుతుందని కోటగిరి జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రమోద్ పేర్కొన్నారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లోని పలు జిల్లా పరిషత్ పాఠశాలల్లో మంగళవారం 9, 10వ తరగతి విద్యార్థులతో ఇంటర్ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దత్తాత్రి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో మాట్లాడుతున్న అధ్యాపకులు ప్రమోద్

వైద్యుల సలహాతో మందులు వాడాలి

రెంజల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సలహా మేరకే యాంటీబయాటిక్ మందులను వాడాలని వైద్యాధికారి సాహిస్త ఫిర్దోస్ అన్నారు. మంగళవారం వరల్డ్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా రెంజల్‌లో వైద్యసిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. వైద్యుల సూచనలు లేకుండా యాంటీబయాటిక్ మందులు వాడకూడదని, రోగులు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి వైద్యుల మందులు వాడాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమోదిత, ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపె రవీందర్, సూపర్‌వైజర్ మాలాన్‌బి, సిబ్బంది తదితరులు ఉన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బోధన్‌లో పోలీసుల ఆపరేషన్ చబూత్ర

బోధన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో పోలీసులు రాత్రి వేళల్లో ఆకతాయిల పనిపట్టేందుకు ఆపరేషన్ చబూత్ర పేరిట చర్యలు చేపడుతున్నారు. సోమవారం రాత్రి పట్టణ సీఐ వెంకట నారాయణ పోలీసులతో కలిసి రాకాసిపేట్, గోశాల ప్రాంతాలలో ఆపరేషన్ చభుత్ర నిర్వహించారు. రాత్రిపూట తిరుగుతున్న 42 మంది యువకులను పట్టుకున్నారు. మంగళవారం ఉదయం వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. 13 వాహనాల పత్రాలను పరిశీలించడం జరిగిందన్నారు. రాత్రి వేళల్లో పనిలేకున్నా రోడ్లమీద తిరగవద్దన్నారు. అతివేగం, అధిక శబ్దాలతో వాహనాలను డ్రైవింగ్ చేయవద్దని పేర్కొన్నారు. మొదటి సారి పట్టుబడినందున వదిలివేస్తున్నామని, మరోసారి ఇలానే జరిగితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. యువత చెడుమార్గంలో వెళ్లకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలలి అన్నారు. పట్టణ ఎస్ఐలు భాస్కర్ చారి, చిరంజీవి, హబీబ్ ఖాన్‌లతో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

తెలంగాణ జాగృతి అడహక్ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్

నవీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ జాగృతి తన సత్తాను చాటుతుందని జాగృతి బోధన్ నియోజకవర్గం అడహక్ కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే మూడు, నాలుగు మాసాల్లో జాగృతిలో భారీగా చేరికలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల సిద్దిపేటకు చెందిన కొందరు బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు ఇటీవల పలువురు అనర్హులకు సైతం రేషన్ కార్డులు ఇప్పించారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యుడు రాఘవేంద్ర యాదవ్, అధికార ప్రతినిధి శేఖర్‌రాజు, రాజేశ్వర్, పితాంబర్, కృష్ణమోహన్‌రావు, శ్రీనివాస్, గంగాధర్, శ్యామ్, ఉన్నారు.



నవీపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి అడహక్ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్

ఎల్లారెడ్డిలో నషాముక్త్ భారత్



ప్రతిజ్ఞ చేస్తున్న డ్వాక్రా మహిళలు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మహేష్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బందికి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, నిర్మూలన మార్గాలు, సమాజంపై ప్రభావం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. యువతే దేశానికి పునాది, యువత మాదకద్రవ్యాల భారిన పడితే దేశభవిష్యత్తు నాశనం అవుతుంద న్నారు. నశా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. మేనేజర్ వాసంతి, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన వారికి అవకాశం కల్పించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరై నిర్మాణాలు చేపట్టని వారి స్థానంలో అర్హులైన వారికి అవకాశం కల్పించాలని మండల డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండల పరిధిలోని కల్యాణి గ్రామపంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య పనులపై ఆరాతీశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధారాణి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సంజీవులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సురేష్‌గౌడ్, గంగారాం, అనిత, కిష్టవ్వ, తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి



పాడైన రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

రామారెడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి నుంచి రామారెడ్డి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. మంగళవారం ఆ రోడ్డును రామారెడ్డి మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల చేపట్టిన రోడ్డు పనులు పూర్తిగా నాసిరకంగా జరిగాయని ఆరోపించారు. మండలకేంద్రానికి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బాగుచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బుచ్చిరెడ్డి, అంజయ్య, భైరయ్య, మల్లేష్, శ్రీనివాస్ గుప్తా, రాజయ్య, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు



భిక్కనూరులో ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు నవీన్‌సాయి

భిక్కనూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం వైద్యుడు నవీన్‌సాయి దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం వల్ల మానసిక ఉపశమనం కలుగుతుందని, క్రమం తప్పకుండా ప్రతి మంగళవారం, గురువారం ఫిజియోథెరపీ శిబిరానికి తీసుకురావాలన్నారు. ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం పద్మ, ఐఆర్పీ మహేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తిచూపాలి



మాట్లాడుతున్న విండో చైర్మన్ స్వామిగౌడ్

మాచారెడ్డి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపాలని మాచారెడ్డి సింగిల్ విండో చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. మంగళవారం పంటల సాగుపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విండో చైర్మన్, సహకార జిల్లా అధికారి రాంమోహన్, హార్టికల్చర్ జిల్లా అధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ పంట సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని, దిగుబడి అధికంగా వస్తుందన్నారు. మాచారెడ్డి పరిధిలో 100ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ పంట సాగుకు ఎస్సీ, ఎస్టీలకు 100శాతం సబ్సిడీతో, బీసీలకు 90శాతం సబ్సిడీతో డ్రిప్ వస్తుందన్నారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్లు, విండో సీఈవో, ఏఈవోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు



పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

మహమ్మద్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలో పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని మహమ్మద్‌నగర్ ఎస్సై శివకుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నమ్మదగిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వారి వద్ద నుండి రూ.6,950 నగదు, 3 సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడినట్లు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మండలంలో పేకాట స్థావరాలపై నిఘా పెట్టడం జరిగిందని వివరించారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

కోత యంత్రాలతో వరిని కోస్తూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తరలిస్తున్నారు. గత వారం రోజుల వ్యవధిలోనే భారీ మొత్తంలో వరి ధాన్యం కేంద్రాలకు రైతులు తరలిస్తున్నారు. ఈ రెండు రోజుల వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారంటే కేంద్రాలకు వరి రాశులు ఎంత మేర వస్తున్నాయో అర్థమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రారంభించిన 429 కొనుగోలు కేంద్రాల నుంచి 2,08,360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 16,450 మంది రైతుల నుంచి రూ.468.50 కోట్ల విలువ చేసే వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు పలువురు రైతుల ఖాతాలో రూ.258.65 కోట్లు ధాన్యం డబ్బులను జమ చేశారు. ప్రతి రోజూ 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

సన్నాలకు రూ.26.66 కోట్లు బోనస్ చెల్లింపు

కాంగ్రెస్ ప్రభుత్వం గత వానాకాలం సీజన్ నుంచి సన్న ధాన్యాన్ని కొనుగోలు చేపడుతూ రైతులకు బోనస్ చెల్లిస్తోంది. ఇందులో భాగంగా ఈ వర్షకాలం సీజన్‌లో దొడ్డు రకం, సన్నరకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 1లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే ఇప్పటి వరకు 64,439 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని 9,718 మంది రైతుల నుంచి కొనుగోళ్లు చేశారు. ఇందులో ఇప్పటి వరకు సుమారు 8,255 మంది రైతుల వద్ద కొనుగోలు చేసిన 53,319 మెట్రిక్ టన్నుల సన్న రకం వడ్లకు రూ.26.66 కోట్ల బోనస్‌ను ప్రభుత్వం చెల్లించింది.

తగ్గిన దిగుబడులు

ఈ వర్షకాలం సీజన్‌లో వరి ఆశించిన మేరలో దిగుబడులు వస్తాయని రైతులు అనుకున్నారు. కానీ భారీ వర్షాలు, వరదలతో పంటలకు నష్టం వాటిళ్లగా కోతల సమయంలో చీడపీడల బెడదతో దిగుబడులు తగ్గిపోయాయని చెబుతున్నారు. గతంలో ఎకరానికి 25 క్వింటాళ్లకు పైగా ధాన్యం దిగుబడులు రాగా ప్రస్తుతం 15 నుంచి 20 క్వింటళ్లలోపే ధాన్యం వస్తుందని పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో 3.10 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా భారీ వర్షాలతో 20వేల ఎకరాలకు పైగా వరికి నష్టం వాటిల్లింది. ఇది కాకుండా తెగులు సోకడంతో పంట దిగుబడులు పడిపోయాయి. దీంతో ఈ సీజన్‌లో సాగుచేసిన రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

శాబ్దిపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

కామారెడ్డి రూరల్: శాబ్దిపూర్ ప్యాడీ కొనుగోలు కేంద్రాన్ని ఇతర కేంద్రాలు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు తెచ్చిన వడ్లను ప్యాడీక్లీనర్ ద్వారా తూకం వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానం వల్ల ధాన్యంలో దుమ్ము, ధూళి తొలగిపోయి రైతులకు తూకం నష్టం తగ్గుతాయని తెలిపారు. ఇప్పటి వరకు 76 మంది రైతుల నుంచి 3,142 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సేకరించిన ధాన్యాన్ని 13 లారీల ద్వారా రైస్‌మిల్లులకు పంపినట్లు తెలిపారు. అందులో 9 ట్రక్‌షీట్ల ఎంట్రీలు ట్యాబ్‌లో పూర్తి అయ్యాయన్నారు. డిప్యూటీ ట్రైని కలెక్టర్ రవితేజ, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ సురేందర్, డీఎం శ్రీకాంత్, తహసీల్దార్ జనార్ధన్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో.. కస్సు బస్సు!

(5వ పేజీ తరువాయి)

జరుగుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఎక్కువగా ఉండటంతో కళాశాల, పాఠశాలలకు సమయం మించి పోతుందన్న ఉద్దేశ్యంతో ఉన్న బస్సుల్లోనే ఎక్కడంతో ఆ సమయాల్లో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పలు రూట్లలో బస్సు ట్రిప్పుల కుదింపు

జిల్లాలోని పలు రూట్లలో ఆర్టీసీ అధికారులు బస్సుల ట్రిప్పులను తగ్గించారని దీంతోనే సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కామారెడ్డి-రామాయంపేట రూట్‌లో ఆరు బస్సులు ఆరు ట్రిప్పుల చొప్పున నడుస్తుండేవని, ప్రస్తుతం వాటిని తగ్గించి కేవలం మూడు బస్సులు మాత్రమే ఆరు ట్రిప్పుల చొప్పున నడుస్తుండగా మిగితా మూడు బస్సుల్లో ఒక్కో ట్రిప్పును రామాయంపేటకు నడిపి మిగితా రెండు ట్రిప్పులను మేడ్చల్‌కు ఎక్స్‌ప్రెస్‌గా నడిపిస్తున్నారని ప్రయాణికుల వాదన. ఆర్డినరీ ఎక్స్‌ప్రెస్‌గా మార్చడంతో గ్రామాల స్టేజీల వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు రూట్లలో ఇదే సమస్య ఉందని ట్రిప్పులను తగ్గించకుండా మరిన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీట్ల కోసం ప్రయాణికుల కొట్లాటలు

బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఇటీవల ఆర్టీసీ బస్సుల్లో ఎక్కువగా సీట్ల కోసం ప్రయాణికుల మధ్య కొట్లాటలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. బస్సు బస్టాండ్‌లో కానీ స్టేజీ వద్ద కానీ ఆగిందంటే చాలు ప్రయాణికులు సీట్ల కోసం కిటికీల్లో నుంచి బ్యాగులను, తదితర వస్తువులను వేయడం కోసం పెద్ద యుద్ధమే చేస్తున్నారు. ఒక వేళ వారు వేసిన వస్తువులను ఎవరైనా తీసిన, పక్కనకు జరిపిన పెద్ద కొట్లాటనే చోటు చేసుకుంటుంది. ప్రయాణికులు ఎక్కువగా ఉండటం కారణంగా తదితర కారణాలతోనూ గొడవలు జరుగుతున్న పరిస్థితి ఉంది. బస్సుల్లో ఓవర్‌లోడ్ కారణంగా ఇతర ప్రైవేటు వాహనాల్లో వెళదామనుకుంటే వారు డబుల్ చార్జీలను వసూళ్లు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని సంబంధిత అధికారులు

బస్సుల్లో ప్రయాణికులు, సిబ్బంది ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంబంధిత ఆర్టీసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిత్యం అధికారులు పర్యవేక్షిస్తూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సింది పోయి ఎవరైనా ఫిర్యాదులు చేస్తే పట్టించుకోవడం లేదని, ఎందుకని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ప్రయాణికులు ఎక్కువగా ఉంటున్న రూట్లలో మరిన్ని బస్సులను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ట్రిప్పులను తగ్గించలేదు

కామారెడ్డి డిపో పరిధిలోని రూట్లలో బస్సు ట్రిప్పులను తగ్గించలేదు. ఉదయం, సాయంత్రం కళాశాల, పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా ఉండటంతో కొంత ఇబ్బంది తలెత్తుతోంది. బస్సులు సమయానికి రాకపోవడం కానీ, ట్రిప్పులు తగ్గించడం లాంటి సమస్య తన దృష్టికి రాలేదు, ఒకవేళ వస్తే తప్పకుండా పరిష్కరిస్తాం.

- దినేష్, కామారెడ్డి డిపో మేనేజర్



చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

చెరువులో చేప పిల్లల విడుదల

బాన్సువాడ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామ చెరువుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న చేప పిల్లలను మంగళవారం ఎంపీడీవో ఆనంద్ వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల బలోపేతానికి ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందజేయడం జరుగుతుందని, చేపలను దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మత్స్యశాక అధికారి డోలిసింగ్, జిల్లా మత్స్యసహకార సంఘం ఉపాధ్యక్షులు సాయిలు, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, నాయకులు నరేందర్, మత్స్యకారులు పాల్గొన్నారు.

పంచాయతీని సందర్శించిన విద్యార్థులు

దోమకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) బీబీపేట మండలంలోని మాందాపూర్ గ్రామంలోని ప్రైమరీ పాఠశాలకు చెందిన విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులు క్షేత్ర పర్యటన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాయలం సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి గంగుబాయి గ్రామ పంచాయతీ పనితీరు, వ్యక్తిగత పరిశుభ్రత, ప్రజలకు అందించే విధులు, సౌకర్యాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పల్లెదవాఖానా వైద్యాధికారిణి వందన పిల్లలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తి గత పరిశుభ్రత పట్ల తెలియజేశారు. హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వెంకటేష్, స్వప్న, భవాని, జెస్సికా, రఫియా, ఏఎన్‌ఎం సుమలత, సుకన్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాందాపూర్ పల్లె దవాఖానా వద్ద విద్యార్థులు

పోలీసుల స్పందన.. తప్పిన ప్రాణాపాయం

సదాశివనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలం కుప్రియాల్ స్టేజీ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో పోలీసులు తక్షణం స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాలు.. మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి నవీన్, సౌందర్య ద్విచక్రవాహ నంపై గ్రామానికి వస్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంతో బైక్‌పై ఉన్న ఇద్దరికీ గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే సదాశివనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోలీసు పెట్రోలింగ్ వాహనంలో ప్రథమచికిత్స కోసం కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి స్థిరంగా ఉందని, పోలీసులు తక్షణమే స్పందించడంతో ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించామని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ మేరకు గాయపడిన వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు చెస్‌బోర్డ్స్ అందజేత

కామారెడ్డిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు చెస్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చెస్‌బోర్డ్స్ అందించారని డీఈవో రాజు తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి మండలంలో మొట్టమొదటిగా సీఎస్‌వో వ్యవస్థాపకుడు సుదీర్‌కోడాటి ఈ కార్యక్రమం చేపట్టారని చెప్పారు. ఆర్గనైజేషన్ సభ్యులు శంకర్ సలావత్, ననసలావత్‌లు, కిరణ్‌కుమార్‌రెడ్డిలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెస్‌బోర్డ్స్ అందించి పిల్లలను సెల్‌ఫోన్ వ్యాపకాల నుంచి దూరం చేసే దిశగా ముందుకు రావడం అభినందించదిగన విషయమని అన్నారు. ఈ సందర్భంగా వారిని డీఈవో రాజు అభినందించారు.



పాఠశాలలకు చెస్‌బోర్డ్స్‌ను అందించిన చెస్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్ సభ్యులను అభినందిస్తున్న డీఈవో

వ్యాపారసముదాయంలో విద్యుత్ ప్రమాదం



ప్రమాదంలో చెలరేగుతున్న మంటలు

కామారెడ్డిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రం లోని జేపీఎన్ రోడ్డులో గల శ్రీసాయి పరమేశ్వర కట్‌మిట్ దుకాణంలో విద్యుత్ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగ ళవారం తెల్లవారు జామున కట్‌మిట్ దుకాణంలో విద్యుత్ ప్రమాదం కారణంగా మంటలు చెలరేగడంతో స్థానికులు దుకాణ యాజమానికి సమాచా రం చేరవేశారు. వెంటనే ఆయన అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

లక్కీడ్రా పేరుతో మోసం.. వ్యక్తిపై కేసు



వివరాలు వెల్లడిస్తున్న రాజంపేట సీఐ సంపత్ కుమార్

రాజంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పోలీసు స్టేషన్ పరిధిలోని బస్వన్నపల్లి గ్రామంలో లక్కీ డ్రా పేరుతో ప్రజలను మోసం చేసి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్న వ్యక్తి పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. లక్కీ డ్రా, లాండ్ సెల్ పేరుతో ప్రచారం చేస్తున్న బస్వన్నపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజు తన వ్యవసాయ భూమి 2.10 ఎకరాలను లక్కీడ్రా సేల్ పేరుతో 500ల టోకెన్లు జమచేసి ఒక్కో టోకెన్ రూ.10వేల చొప్పున వసూళ్లు చేయడానికి పాంప్లెట్లు ముద్రించి వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేశాడని తెలిపారు. ఆదివారం నలుగురు వ్యక్తుల వద్ద నుంచి రూ.40వేలు వసూలు చేశాడని, మరో ఆరుగురు సైతం డబ్బులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని దీంతో అడ్డుకట్ట వేశామని తెలిపారు. అనుమతి లేకుండా లక్కీడ్రా, మనీ సర్క్యులేషన్ పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అనుమతులు లేకుండా స్కీమ్‌ల పేరుతో ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

సంక్షిప్త సమాచారం

పారిశుధ్య కార్మికుడికి ఆర్థికసహాయం

కామారెడ్డిటౌన్: కామారెడ్డి మునిసిపల్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న షేక్ మహబూబ్ కుమార్తె వివాహం మంగళవారం జరిగింది. వివాహానికి రూ.40వేల ఆర్థిక సహాయాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు చాట్ల వంశీ, శ్రీనివాస్, సుధాకర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

క్యాసంపల్లి ప్రభుత్వ పాఠశాలలో పరిశీలన

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా పర్యవేక్షణ కమిటీ సభ్యులు పరిశీలించారు. పాఠ శాలలోని విద్యా కార్యక్రమాలు, మరుగు దొడ్లు, తాగునీరు, ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాలను పరిశీలించారు. అంతకు ముందు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవాల్యూవేషన్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న యంగ్ యర్త్ లీడర్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ సుస్థిరాభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్ల ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు, ఉపాధ్యాయులు సదాశివుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

290 మందికి వైద్యపరీక్షలు

లింగంపేట: మండలంలోని మెంగారం, బోనాల్ గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు 290 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 35మంది రోగులకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రికి రావాలని సూచించారు. రిఫర్ చేసిన రోగులను ఉచితంగా బస్సుల్లో తీసుకువెళ్లి తీసుకువస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యశిబిరం ఆర్గనైజర్ వెంకట్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు రమేష్, బాలయ్య తదితరులు ఉన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు

రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎంపీడీవో బాలకృష్ణ అందజేశారు. ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని గైడ్‌లెన్స్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని విడతల వారీగా ప్రభుత్వం డబ్బులు జమచేస్తుం దని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇళ్ల పురోగతిపై సమీక్ష

కామారెడ్డిటౌన్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. మంగళవారం మాచారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట ఎంపీడీవోలతో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు 3 మండలాల అధికారులతో రివ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు మాచారెడ్డిలో 345 ఇళ్లు మంజూరవగా 200ల ఇళ్లు ప్రోగ్రెస్‌లో ఉండగా, లింగంపేటలో 519 మంజూరవగా 397 ప్రారంభించి 310 పురోగతిలో ఉన్నాయని, నాగిరెడ్డిపేట మండలంలో 323 మంజూరవగా 246 ప్రారంభించి 177 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని అన్నారు.

కవి దంపతులకు ప్రశంసాలు

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన శేషారావు, అంగన్‌వాడీ టీచర్ ఉమారాణి దంపతులు అందమైన బాల్యం అనే శీర్షికతో శ్రీ కళావేదిక వారు అంతర్జాలంలో నిర్వహించిన కవితా పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ కవితలు రాసినందుకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరిభూషణం, జాతీయ కార్యనిర్వహక కార్యదర్శి సంపత్ కుమార్ దంపతులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందించారు.

జూనియర్ కళాశాలల్లో సృజనాత్మక విద్యాబోధన

లింగంపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సృజనాత్మక విద్యాబోధన అందిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని పోల్కంపేట, పోతాయిపల్లి, నల్లమడుగు, శెట్పల్లి, బాణాపూర్‌లతో పాటు పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి, 9వ తరగతి విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల లెక్చరర్లు పాఠ్యంశాలను బోధించడంతో పాటు వచ్చే ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు నీట్, జేఈఈ, ఎంసెట్‌లలో ప్రత్యేక శిక్షణను ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు, స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు దుర్గయ్య, దర్‌సింగ్, రాజయ్య, నాగు, పోతాయిపల్లి ప్రధానోపాధ్యాయుడు అంజిల్‌రెడ్డి, పోల్కంపేట ప్రధానోపాధ్యాయుడు వేనుగోపాల్, సురేష్‌లతో పాటు విద్యార్థులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కామారెడ్డి విద్యార్థులు

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఖేల్ ఇండియా బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వ హించిన అండర్-14 బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీల్లో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎం పికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ తెలి పారు. పోటీలకు ఎంపికైన వారిలో జీషన్ అలీ, నేహాన్, విష్ణువర్ధన్‌గౌడ్, జైప్రిత్, రుద్రన్స్‌రావు, బాలికల విభా గంలో వేదశ్రీ, అక్షర, తేజశ్విని, శివవేదన్షిలు ఉన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఇళ్ల మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణానికి మ్యాప్ ఇచ్చి ముగ్గు పోయించారు. అనంతరం పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణం పనులు వేగవంతంగా చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించాలి

తాడ్వాయి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు త్వరగా నిర్మాణాలు చేపట్టేలా చూడాలని సీఈవో చందర్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు బిల్లులు త్వరగా పడేటట్లు చూడాలని అన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో ఉండి ఇందిరమ్మ ఇండ్లను ప్రతిరోజు పరిశీలించాలని ఆదేశించారు. సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, గ్రామాల కార్యదర్శులున్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- బాహుబలి (ది ఎపిక్)
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి మాస్ జాతర
వెంకటేశ్వర జటాధర

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230